# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 11-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఉన్నత విద్య, పరిశోధన, సామాజిక అభివృద్ధి రంగాల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గొప్ప సేవలు అందిస్తోందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

2. **సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు సమగ్ర ప్రయోజనాలు అందించే విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దృష్ట్యా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని హోంమంత్రి వి. అనిత అధికారులకు సూచించారు.**

4. **కృష్ణాజిల్లా మచిలీపట్నంలో 8 వేల కోట్ల రూపాయలతో గోవా షిప్‌యార్డ్ ఓడల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.**

==========================

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో స్వర్ణోత్సవ వేడుకలను ఈరోజు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 50 ఏళ్ల స్మారక స్థూపాన్ని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 50 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకోవడం చారిత్రాత్మక మైలురాయన్నారు.భవిష్యత్తులోనూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్య, పరిశోధన, సామాజిక అభివృద్ధి రంగాల్లో ఐదు దశాబ్దాలుగా విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను ప్రశంసనీయమని గవర్నర్ పేర్కొంటూ...

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు సమగ్ర ప్రయోజనాలు అందించే విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవరోజు కొనసాగుతోంది. సమావేశంలో ఈరోజు సూపర్-6 పథకాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సంక్షేమ విధానాలు ఉండాలని అన్నారు. పరిపాలనా విధానాలలో సాంకేతికత వినియోగం ద్వారా

మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

-----------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని హోంమంత్రి వి. అనిత అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న మూడు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అల్పపీడనం పరిస్థితిపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం 112 లేదా 1070 లేదా 1800 425 0101 నంబర్లను సంప్రదించాలని మంత్రి సూచించారు.

-----------------------------

బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు ఒక ప్రకటనలో సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని కోరారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి వాతావరణ పరిస్థితులు, శాఖ సూచనలను మత్స్యకారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. తీర ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జగరకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

-----------------------------

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో 8 వేల కోట్ల రూపాయలతో గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ఓడల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ.. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. మచిలీపట్నం నుంచి సముద్ర రంగంలో కొత్త శకానికి నాంది పలికేలా ఈ షిప్‌యార్డ్ ఏర్పాటు కానుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో మచిలీపట్నం ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

-----------------------------

ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు- 2026ను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నిబంధనలు ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిబంధనలపై నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ మాట్లాడుతూ.. చెత్త సేకరణ, వేరు చేయడం, రవాణా, శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణకు ఈ నిబంధనలు దోహదపడతాయని తెలిపారు. మారుతున్న అవసరాలకు

అనుగుణంగా ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌పై ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజుకు 280-290 మిలియన్ యూనిట్ల మేర విద్యుత్ వినియోగం నమోదవుతోందని అధికారులు తెలిపారు. విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించారు. కొరత కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం డిస్కంలు, ఉత్పత్తి, కొనుగోలు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఎరువుల లోడుతో విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఎనిమిది బోగీలు కొవ్వూరు మెయిన్ లైన్‌లో పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు రైళ్లు వివిధ స్టేషన్లలో నిలిచిపోయాయి. కొవ్వూరులో వందేభారత్, తునిలో యలహంక సూపర్‌ఫాస్ట్, నర్సీపట్నంలో జన్మభూమి, అన్నవరంలో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపివేశారు. మరికొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈనేపథ్యంలో ఈరోజు విశాఖపట్నం నుంచి బయలుదేరాల్సిన రాజమహేంద్రవరం-విశాఖపట్నం ప్యాసింజర్, విశాఖపట్నం-రాజమహేంద్రవరం ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ కోస్తా రైల్వే అధికారులు తెలిపారు.

---------------------------

అనంతపురం జిల్లా వ్యాప్తంగా రేపు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జస్టిస్ ఈ. భీమారావు తెలిపారు. లోక్ అదాలత్‌లో భాగంగా రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ గొప్ప అవకాశమని పేర్కొంటూ.. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ భీమారావు కోరారు.

---------------------------

అటవీ సంపద పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అటవీ అమరవీరుల సేవలను స్మరించుకునే ఉద్దేశంతో ప్రతి ఏటా సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని పాటించాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ 2013లో ప్రకటించింది.

=====================